www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 25 ఫిబ్రవరి 2025

ఉపాధి కూలీలకు 150 రోజుల పనిదినాలు : పీడీ

ప్రజాశక్తి-పీలేరు

జాతీయ గ్రామీణ ఉపాధి చట్టం ద్వారా కరువు మండలాల్లో ఉపాధి కూలీలకు 150 రోజుల పనిదినాలు కల్పిస్తున్నట్లు అన్నమయ్య జిల్లా డ్వామా పీడీ వెంకటరత్నం తెలిపారు. పీలేరు మండలం, ముడు పులవేముల పంచాయతీ, కుమ్మరపల్లిలో సుబ్రహ్మణ్యం అనే రైతు పొలంలో సోమవారం ప్రారంభించిన ఫారం పాండ్ పనిని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీలతో పీడీ మాట్లాడుతూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల మేరకు కరువు మండలాల్లో 150 రోజుల పని దినాలు కల్పిస్తామన్నారు. వర్షపు నీరు వృధా కాకుండా రైతులు తమ మామిడి తోటల్లో ఫారం పాండ్‌లు తవ్వుకుని నీటిని నిలువ చేసుకునేందుకు కృషి చేయాలని చెప్పారు. ఆయన వెంట పీలేరు మండల ఎపిఒ అశోక్ రెడ్డి, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రైతు పొలంలో ఫారంపాండ్ పనులను పరిశీలిస్తున్న పీడీ

108 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

108 అంబులెన్స్ ఉద్యోగులకు 2024లో ప్రభుత్వం రాతపూర్వక ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటి అమలు కాలేదని, వాటిని పూర్తి స్థాయిలో వెంటనే అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు డిమాండ్ చేశారు. సోమవారం 108 ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 108 అంబులెన్స్ సర్వీస్‌లో నిబద్ధతతో కూడిన విధులు నిర్వహిస్తూ రాష్ట్రంలో మారుమూల గ్రామాలకు సైతం అత్యవసర వైద్య సేవలను అందిస్తున్నారని చెప్పారు. అత్యవసర, ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న వారిని కాపాడడంలో ప్రత్యేక పాత్ర పోషిస్తారని చెప్పారు. కేసుల తరలింపుకు ప్రత్యేక వాహనాల ఏర్పాటుపై స్పష్టత లేకపోవడం కారణంగా గోల్డెన్ హవర్ కాన్సెప్ట్ నీరు గారే ప్రమాదం ఉందని. 108 సర్వీస్‌లో మండలానికి ఒక అంబులెన్స్‌ను విస్తరించే సమయంలో ఈ సర్వీస్ లోకి వచ్చిన ఉద్యోగులు కరోనా వంటి ఆపత్కాల సమయంలో కూడా విశేష సేవలు అందించారని చెప్పారు. అతి త్వరలో ఐదేళ్లు పూర్తి చేసుకొనే ముందుగానే శాలరీ ఫిక్సేషన్ చేయడం వల్ల వారు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని మండి పడ్డారు. వారి సేవలను, సర్వీసును పరిగణలోకి తీసుకొని స్లాబ్ అప్‌గ్రేడేషన్ ఆర్‌పిఎఫ్‌లో చేర్చాలని కోరారు. 108 ఉద్యోగుల యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణ యాదవ్, బి.వి.చలపతి మాట్లాడుతూ మినిట్స్‌లో తెలపిన విధంగా వాహనాలు, వాహన సిబ్బందికి కనీస వసతులతో కూడిన శాశ్వత భవనాల ఏర్పాటును ప్రభుత్వం చేపట్టాలని కోరారు. 108 ఉద్యోగుల సేవలను గుర్తించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రస్తుతం ఇస్తున్న వేతనానికి అదనంగా నెలకు మరో రూ.4 వేలు ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డిమాండ్‌లతో కూడిన వినతిపత్రన్ని కలెక్టర్ శ్రీధర్ చాకూరికు అందించారు. కార్యక్రమంలో 108 ఉద్యోగులు వై. రామాంజులు, చంద్రబాబు, బాలాజీ, రవి ప్రకాష్, గోపాల్ రాజు, దయానంద్, అన్వర్ బాష, ప్రసాద్ రాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న 108 ఉద్యోగులు

సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లాను నాటు సారా రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే నవోదయం 2.0 కార్యక్రమం లక్ష్యమని, నాటు సారా అమ్మకాలపై టోల్ ఫ్రీ నెంబర్-14405కు ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. సోమవారం మధ్యాహ్నం రాయచోటి కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో నవోదయం-2.0 కార్యక్రమానికి సంబంధించి జిల్లా ఎక్సైజ్ శాఖ వారి ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారాపై ప్రజల్లో అవగాహన కల్పించి నాటు సారా నిర్మూలన కోసం రాష్ట్ర ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించిందని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా గ్రామాలు పట్టణాలలో అవగాహన సదస్సులు నిర్వహించి నాటు సారా వల్ల ప్రజలకు కలిగే ఆర్థిక సామాజిక ఇబ్బందులపై ప్రజల్లో అవగాహన పెంచుతామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని అవగాహన కార్యక్రమాలు నిర్వహించి జిల్లాను నాటుసార రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని ఎక్సైజ్ శాఖ అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. నాటు సారాను ఎట్టి పరిస్థితులలో తాగవద్దని ప్రజలకు సూచించారు. నాటు సారాను అమ్మిన, రవాణా చేసిన, నిల్వ ఉంచిన వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని, నాటు సారా తయారీ, రవాణా, అమ్మకాలపై ఫిర్యాదులను రాష్ట్రస్థాయి కంట్రోల్ రూమ్‌లో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్-14405 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ మధుసూదన్ రావు, ఎస్‌డిసి రమాదేవి, జిల్లా ఎక్సైజ్ అధికారి మధుసూదన్, ఆ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నిమ్మనపల్లి: నాటు సారా రహిత సమాజాన్ని కలసికట్టుగా నిర్మిద్దామని ఎస్ఐ తిప్పేస్వామి అన్నారు. సోమవారం నిమ్మనపల్లె పంచాయతీ నాగులయ్య గారిపల్లెలో నాటు సారా రహిత సమాజం దిశగా ఆంధ్రప్రదేశ్ నవోదయం 2.0 కార్యక్రమంపై స్థానిక సర్పంచ్ పాపులమ్మ మల్లప్ప, మదనపల్లి ఎక్సైజ్ శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు వెంకటరమణారెడ్డి, రాజేష్, టిడిపి నాయకులు మల్లికార్జునతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అధికారులు, పోలీస్ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

టోల్‌ఫ్రీ నెంబర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

బాల కార్మికులతో పనిచేయిస్తే చర్యలు : కలెక్టర్

బాలకార్మిక చట్టం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

ప్రజాశక్తి - రాయచోటి

14 సంవత్సరాలలోపు బాలలతో పనిచేయించుకోవడం పూర్తిగా నిషేధమని, అలా చేయిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పేర్కొన్నారు. బాల కార్మికుల గురించి ఫిర్యాదుకై 1098లో సంప్రదించవచ్చని తెలిపారు. సోమవారం మధ్యాహ్నం రాయచోటి కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో బాల, కౌమార కార్మిక వ్యవస్థ (నిషేధ, నియంత్రణ) చట్టం-1986పై జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ శ్రీధర్ చామ కూరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల కార్మిక నియంత్రణ చట్టం 1986లోని సెక్షన్ 3 ప్రకారం ఏ వృత్తిలో అయినా, ఏ ప్రక్రియలో అయినా 14 సంవత్సరాల లోపు బాల బాలికల చేత పని చేయించుకోవడం లేదా పనిలోకి అనుమతించడం పూర్తిగా నిషేధమని చెప్పారు. ఉల్లంఘించిన వారికి 06 నెలల నుండి 02 సంవత్సరాల వరకు జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని పేర్కొన్నారు. షాపులు, సంస్థలు, ఫ్యాక్టరీలు బాల కార్మికులతో పనిచేయించుకోకూడదని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో డిఆర్ఒ మధుసూ దనరావు, జిల్లా కార్మిక శాఖ అధికారి రంగరాజు, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి ప్రమీల, డిఇఒ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

'జాతీయ పశు వ్యాధి నియంత్రణ'ను సద్వినియోగం చేసుకోవాలి

మార్చి ఒకటి నుంచి 30 వరకు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే జాతీయ పశు వ్యాధి నివారణ పథకాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని, గాలికుంటు వ్యాధికి, బ్రూస్ ఎల్లోసిస్ వ్యాధులకు టీకాల పంపిణీ చేస్తారని కలెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పశువులకు సకాలంలో టీకాలు వేయించడం ద్వారా ఎన్నో వ్యాధులను అరికట్టవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో మార్చి 30 వరకు గాలికొంటూ వ్యాధి, బ్రూసెల్లోసిస్ వ్యాధులకు టీకాలు పంపిణీ చేస్తున్నట్లుగా పేర్కొన్నారు. టీకాలను రైతులందరూ వినియోగించుకొని పశువులకు వచ్చే వ్యాధులు నియంత్రించాలని సూచించారు. కార్యక్రమంలో డిఆర్ఒ మధుసూదనరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి గుణశేఖర్ పిళ్ళై, ఆ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఎసిబి వలలో చేనేత, జౌళి శాఖ ఏడీ

- రూ.70 వేలు లంచం తీసుకుంటూ దొరికిన కృష్ణయ్య
- వివరాలు వెల్లడించిన డిఎస్‌పి ప్రశాంతి

ప్రజాశక్తి-రాయచోటి

చేనేత కార్మికుల నుంచి లంచం తీసుకుంటూ చేనేత, జౌళి శాఖ ఏడీ కృష్ణయ్య సోమవారం కడప డిఎస్‌పి ప్రశాంతి తెలిపిన వివరాల మేరకు... రూ.70 వేలు లంచం తీసుకుం టుండగా పట్టుకున్నారు. అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన చేనేత కార్మికుడు తారా చంద్ర, విజయ లక్ష్మి హ్యాండ్లూమ్స్ ప్రొడక్షన్ కంపెనీ ఏర్పాటు చేసుకునేందుకు గత ఏడాది నవంబర్‌లో కృష్ణయ్యకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఈ దరఖాస్తును ప్రాసెస్ చేసి విజయవాడలోని డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయానికి పంపేందుకు రూ.1.50 లక్షలు ఇవ్వాలని తారాచంద్రకు అధికారి కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ క్రమంలో మొదటి విడతగా రూ.70 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో తారాచంద్ర సోమవారం రూ.70 వేలు ఇస్తుండగా ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కృష్ణయ్యపై కేసు నమోదు చేశారు. ఎసిబి డిజి ఆదేశాల మేరకు కృష్ణయ్యను అరెస్టు చేసినట్లు డిఎస్‌పి తెలిపారు. కార్యక్రమంలో కడప ఎసిబి అధికారుల, సిబ్బంది పాల్గొన్నారు.

ఎసిబికి చిక్కిన కృష్ణయ్య

సభ్యత్వం రద్దవుతుందనే అసెంబ్లీకి జగన్ : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జగన్ రెడ్డి నాటకాలు ప్రజలందరూ చూస్తున్నారని, అసెంబ్లీకి హాజరు కాకపోతే శాసన సభ్యత్వం రద్దు అవుతుందని అసెంబ్లీకి వచ్చి ప్రతిపక్ష హోదా లేదని వెళ్ళిపోయాడంటే తనకు పదవులు అంటే ఎంత వ్యామోహమో, ఎంత పిచ్చో అర్థమవుతుందని రాజంపేట తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్‌రాజు విమర్శించారు. సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో అనేక మంది గొప్ప గొప్ప నాయకులు ఏ హోదా లేకపోయినా, ఎన్నికలలో ఓటమి ఎదురైనా, ప్రతిపక్ష హోదాకు నోచుకోకపోయినా, ప్రజా సమస్యలపై పోరాడి ప్రభుత్వం దృష్టికి ఆ సమస్యలను తీసుకువచ్చి గొప్ప నాయకులు అనిపించుకున్నారని పేర్కొన్నారు. అయితే ఐదేళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్ మోహన్ రెడ్డి మాత్రం తనకు ప్రతిపక్ష హోదా ఇస్తేనే ప్రజా సమస్యలపై మాట్లాడుతానని, అసెంబ్లీలో తన గళం విప్పుతానని చెప్పడం చూస్తుంటే ఆయన ఎలాంటి నాయకుడో అర్థమవుతుందని అన్నారు. జగన్‌రెడ్డి నాటకాలు చూస్తుంటే, రాజకీయాల కంటే సినిమాలలో నటిస్తే బాగుంటుందని ఆయన ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గన్నే సుబ్బనసయ్య నాయుడు, పట్టణ అధ్యక్షులు దగ్గుబాటి సుబ్రహ్మణ్యం నాయుడు, పోలి చెరువు సంఘం అధ్యక్షులు నాగేశ్వర నాయుడు, పట్టణ క్లస్టర్ ఇంచార్జ్ కొల్లి రెడ్డయ్య నాయుడు, మాజీ మండల అధ్యక్షులు కొవ్వూరు సుబ్రహ్మణ్యం నాయుడు, నాయకులు ధరూరు చైతన్య నాయుడు, నాగేంద్ర తులసి, ఐటిడిపి మేడ ముని బాలకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు

పోలీసుస్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు

ప్రజాశక్తి-పీలేరు

2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ మీడియట్ పరీక్షల ప్రశ్నపత్రాలు పీలేరు పోలీస్ స్టేషన్‌కు చేరాయి. సోమవారం పీలేరు పట్టణంలోని మూడు పరీక్షా కేంద్రాలకు సంబంధించిన ఎగ్జామినేషన్స్ చీఫ్ సూపరింటెండెంట్లు కస్టోడియన్లుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి వాటిని పోలీసుల పర్యవేక్షణలో భద్రపరిచారు. అనంతరం పీలేరు ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యాలయం పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు వై. వెంకటరెడ్డి, బి. రెడ్డప్ప, జి. బేబీకరుణ మీడియాతో మాట్లాడుతూ మార్చి 1 నుంచి 20 వరకు ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పట్టణంలోని మూడు పరీక్ష కేంద్రాల్లోనూ ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 1,320 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 1,136 మంది మొత్తం 2,456 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు చెప్పారు. 1న ఇంటర్ మొదటి సంవత్సరం, 3న ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రారంభం కానున్నాయని తెలియజేశారు. రోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు నిర్వహించే పరీక్షలకు విద్యార్థులు ఉదయం 8:30 గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

పశ్నపత్రాలు భద్రపరచడానికి పోలీసుస్టేషన్‌కు వచ్చిన కస్టోడియన్లు

పి-4 సర్వేలో పురోగతి కొనసాగించాలి

ప్రజాశక్తి -రాయచోటి : పేదరిక నిర్మూలన-పి4 సర్వేలో పురోగతిని కొనసాగించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో పేదరిక నిర్మూలన-పి4 సర్వేపై వివిధ శాఖల అధికా రులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా దిగువన ఉన్న 20 శాతం మందిని దత్తత తీసుకొని పేదరికం నిర్మూలించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. అన్నమయ్య జిల్లాలో కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులను గుర్తించడంలో పురోగతి కనిపిస్తోందని, దీనిని ఇలాగే కొనసాగించాలని, త్వరలో 100 శాతం సర్వేను పూర్తి చేయాలని సిపిఒను, మున్సిపల్ కమిషనర్లను, జిఎస్‌డబ్ల్యూఎస్ అధికారిని, ఎంపిడిఒలను ఆదేశించారు.

చిన్నారుల ఆధార్ అప్‌డేట్ చేయాలి

ప్రజాశక్తి - గాలివీడు : 0-6 వయస్సు కల్గిన చిన్నారుల ఆధార్ అప్‌డేట్ చేయాలని ఎంపిడిఒ జవహర్‌బాబు పేర్కొన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్ వారి విధులు వారు సక్రమంగా నిర్వహించడం లేదని మండిపడ్డారు. రోజూ మహిళా పోలీసులు అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి పిల్లల ఆధార్ అప్‌డేట్ చేయడంతోపాటు తల్లిదండ్రుల వద్ద తంబ్ వేయించాలని పేర్కొన్నారు. రోజూ పాఠశాలలను తనిఖీ చేసి టాయిలెట్ పరిశీలించి ఫొటో అప్లోడ్ చేయాలన్నారు. విధులు నిర్వహించంలో అలసత్వం తగదని, ఇలాగే ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

తపాలా ద్వారా ఉత్తరాలు పంపిస్తున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల పోస్ట్ కార్డు ఉద్యమం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని, ప్రధానంగా ఆప్కాస్ రద్దు చేస్తే కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు సోమవారం పోస్ట్ కార్డు ఉద్యమాన్ని చేపట్టారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ ఆధ్వర్యంలో సోమవారం కార్మికులందరూ ప్రధాన తపాలా కార్యాలయం వద్దకు చేరుకుని ముఖ్యమంత్రి కార్యాలయం చిరునామాతో తమ సమస్యలను విన్నవించుకుంటూ ఉత్తరాల ద్వారా ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.వి రమణ, కోశాధికారి లక్ష్మీదేవి, యూనియన్ నాయకులు ఎం.రమణ, బాలాజీ, ప్రమీల, సురేష్, సునీత పాల్గొన్నారు.

ఎస్‌టి వర్గీకరణ అమలు చేయాలి

ప్రజాశక్తి- రాయచోటి

ఎస్‌టి వర్గీకరణ వెంటనే అమలు చేయాలని యానాదుల సంక్షేమం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పులి శివశంకర్ పేర్కొన్నారు. సోమవారం అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యలు పరిష్కారం వేదికలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. సుప్రీం కోర్టు ఎస్‌సి వర్గీకరణ అమలు చేయాలని తీర్పు నిచ్చిందని, వెంటనే వర్గీకరణ అమలు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా యానాదుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అన్ని జిల్లా కలెక్టర్ ఆఫీసులో సోమవారం వినతి పత్రాలు అందజేశారని చెప్పారు. రాష్ట్రంలో 10 లక్షల మంది జనాభా ఉన్న యానాదులు విద్య, ఉద్యోగ, ఆర్థికపరంగా చాలా వెనకబడి ఉన్నారు. ఎస్‌టి వర్గీకరణ జరిగితే యానాదులకు సంక్షేమ పథకాలు ఉద్యోగాలు ఉపాధి అవకాశాలు వెనకబడిన యానాదులకు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సికోలి బాలాజీ, యానాదులు పాల్గొన్నారు.

నేడు కోళ్ల ఫారంపై గ్రామసభ

ప్రజాశక్తి - గాలివీడు

గోరాన్ చెరువు దాసరివాడ్లపల్లిలో ఉన్న కోళ్ల ఫారంపై స్థానిక సచివాలయం వద్ద మంగళవారం గ్రామసభ నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి సరోజ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇఒపిఆర్‌డి అధ్యక్షతన గ్రామస్తుల సహకారంతో కోళ్ల ఫారం నిర్వహించేందుకు ప్రజలకు ఆమోదయోగ్యం కాదా అనేది గ్రామ సభలో తీర్మాణం చేస్తారన్నారు.

జియోటాగ్ పత్రాన్ని చూపుతున్న ప్రిన్సిపల్ యువరాజ్

టమోటా కొనుగోలుకు జియోటాగ్ రూపకల్పన

ప్రజాశక్తి-మదనపల్లె: మదనపల్లె ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ, సైన్స్ కళాశాలలో మిట్స్-ఐపిఎఫ్‌సి మద్దతుతో మదనపల్లె టమోటాలు కొనుగోలు కోసం భౌగోళిక సూచిక (జిఐ) ట్యాగ్ దరఖాస్తు సమర్పించామని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. విభిన్నమైన రుచి, ఆకృతి, ఆకర్షణీయమైన రంగుకు ప్రసిద్ధి చెందిన మద నపల్లె టమోటా స్థానిక ఆర్థిక వ్యవస్థలో చాలా కాలంగా ప్రధానమైన వ్యవసాయ ఉత్పత్తి అని, ఈ ప్రాంతం యొక్క విలువైన వ్యవసాయ ఉత్పత్తి యొక్క ప్రత్యేక గుర్తింపును రక్షించడానికి మరియు ప్రోత్సహించడానికి, ఆంధ్రప్రదేశ్‌లోని మద నపల్లెలో ఎం-టామేటా ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ మదనపల్లె టమో టాలు కోసం భౌగోళిక సూచిక (జిఐ) ట్యాగ్ కోసం చెన్నైలోని భౌగోళిక సూచికల రిజిస్ట్రీ ఐపిఆర్ కార్యాలయంలో అధికారికంగా దరఖాస్తు చేసుకుం దన్నారు. మదనపల్లె టమోటాలును మదనపల్లె ప్రాంతానికి ప్రత్యేకంగా అనుసం ధానించబడిన ఒక ప్రత్యేకమైన ఉత్పత్తిగా గుర్తించే లక్ష్యంతో రూపొందించిన ఈ దరఖాస్తును మిట్స్ మేధో సంపత్తి సౌకర్యాల కేంద్రం మదనపల్లె, చట్టపరమైన మద్దతుతో దాఖలు చేశారని ఇది జిఐ ట్యాగ్ ప్రక్రియకు చట్టపరమైన ప్రతినిధిగా వ్యవహరిస్తోందన్నారు. అధికార ప్రకటనకు మేము ఎంతో సంతోషిస్తున్నామని, ఈ అవకాశము మా కళాశాలకు దక్కడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అధికారక ప్రకటనలో అడ్వైసర్ ఆర్అండ్‌డి డాక్టర్ తులసీరామ్ నాయుడు, అసోసియేట్ డీన్ ఆర్అండ్‌డి డాక్టర్ శివయ్య పాల్గొన్నారు.

వైభవంగా వీరభద్రస్వామి కల్యాణం

ప్రజాశక్తి-రాయచోటి : పట్టణంలోని శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం నిర్వహించిన స్వామి వారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహోత్సవానికి రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరితమ్మ, తనయుడు నిచ్చల్ నాగిరెడ్డి స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా అర్చకులు వారిని పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కలాణోత్సవానికి జిల్లా నలుమూలల నుంచి భక్తులు విశేష సంఖ్యలో హాజరై స్వామివారికి పూజలు చేశారు. బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయాలని ఇఒ రమణారెడ్డి పేర్కొన్నారు. టిడిపి నాయకులు ఎం.చెన్న కృష్ణరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో సత్తా చాటిన క్రీడాకారులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కడప నగరంలోని డిఎస్ఎ స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి తేక్వాండో పోటీలలో రాజంపేట ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ క్రీడాకారులు పతకాలు సాధించి సత్తా చాటారని అకాడమీ గ్రాండ్ మాస్టర్ బి.సునీల్ తెలియజేశారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు సోమవారం జిఎంసి క్లబ్ ప్రాంగణంలో పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మాస్టర్ సునీల్ మాట్లాడుతూ ఏడుగురు క్రీడాకారులు పోటీలో పాల్గొనగా నలుగురు స్వర్ణ పతకాలు, ముగ్గురు రజత పతకాలు సాధించారని తెలిపారు. పునీత్, ప్రేమ్ భగత్, సాహిత్, ప్రతీక్‌లు స్వర్ణ పతకాలు సాధించగా లాలిత్, లోహిత్, కోమల్ కార్తికేయ రజత పతకాలు సాధించారని వివరించారు. మార్షల్ ఆర్ట్స్ సాధన వల్ల ఆత్మరక్షణ, ఆరోగ్యంతో పాటు పదునైన మేధోశక్తి లభిస్తుందని తెలిపారు. తద్వారా చదువులో కూడా చురుగ్గా రాణిస్తారని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల్ని చదువుతోపాటు క్రీడలలో కూడా రాణించే విధంగా ప్రోత్సాహం అందించాలని కోరారు. కార్యక్రమంలో అకాడమీ ఉపాధ్యక్షులు బచోటి భాస్కర్, ప్రధాన కార్యదర్శి చౌడవరం నరసింహ, కరాటే మాస్టర్ కే.గంగారామ్, ప్రభుత్వ ఉపాధ్యాయులు విజయభాస్కర్ పాల్గొన్నారు.

'నియామకాల నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి'

ప్రజాశక్తి-పీలేరు

ఇటీవల విడుదల చేసిన జూనియర్ సివిల్ జడ్జెస్ పోస్టుల నోటిఫికేషన్ రద్దు చేసి, ఎస్‌సి వర్గీకరణ జరిగాకే న్యాయమూర్తుల నియామక ప్రక్రియను చేపట్టాలని మాదిగల అభివృద్ధి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది, ప్రభుత్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షులు పల్లెపాగు శ్రీనాథ్ మాదిగ న్యాయవాదుల తరపున కోరారు. సోమవారం ఆయన పీలేరులో మీడియాతో మాట్లాడుతూ ఎస్‌సి వర్గీకరణ జరిగే వరకు ఉపాధ్యాయ నియామకాలు ఆపినట్లే, జూనియర్ సివిల్ జడ్జెస్ రిక్రూట్మెంట్ కూడా ఎస్‌సి వర్గీకరణ అమలు చేసేంతవరకు నిలపాలని అన్నారు. జూనియర్ సివిల్ జడ్జి నియామకాల్లో మాదిగలకు గత 75 ఏళ్లుగా అన్యాయం జరుగుతూనే ఉందని తెలిపారు. ప్రస్తుతం విడుదలైన నోటిఫికేషన్ లోనూ ఎస్‌సి వర్గీకరణ లేకుండా జనరల్‌గా 4 ఖాళీలు మాత్రమే చూపారని తెలిపారు. ఎస్‌టిలకు 15 శాతం రిజర్వేషన్ ఉండగా కేవలం 4 సీట్లు మాత్రమే కేటాయించడం అన్యాయమని, ఉన్న మొత్తం 50 ఖాళీల్లో మాల, మాదిగలకు 8 పోస్టులు రావాల్సి ఉంటుందన్నారు. హైకోర్టు విడుదల చేసిన ప్రకటన ప్రకారం జూనియర్ సివిల్ జడ్జి పోస్టులు ఎస్‌సిలకు కేవలం 4 మాత్రమే కేటాయించారని చెప్పారు. ఇది అన్యాయం, అక్రమమని న్యాయంగా తమకు 15 శాతమైతే 8 పోస్టులు రావాలని, తమకు రావలసిన పోస్టులను ఇబిసిలకు 9 పోస్టులుగా కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ విషయాన్ని పరిశీలించి వెంటనే జూనియర్ సివిల్ జడ్జి పోస్టుల నియామకాల కోసం ఇచ్చిన నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాలని కోరారు. చేయకపోతే మాదిగ జాతికే ఆంధ్రప్రదేశ్‌లో తీవ్ర అన్యాయం జరుగుతుందని చెప్పారు. మాదిగలకు న్యాయస్థానాలలో ఇప్పటివరకు ఎలాంటి న్యాయం జరగలేదని, వర్గీకరణ జరిగితే మాదిగలకు కచ్చితంగా 9 శాతం న్యాయమూర్తుల ఖాళీలు అందుతాయి పేర్కొన్నారు. అలా జరగని పక్షంలో ఉమ్మడిగా ఎస్‌సిలకు కేటాయించిన నాలుగు పోస్టులు కూడా తిరిగి మాలలే పొందే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలియజేశారు. ముఖ్యమంత్రి ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ వహించి వెంటనే జూనియర్ సివిల్ జడ్జిల నియామక ప్రక్రియను నిలుపుదల చేసి మాల మాదిగలకు సమ న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

పారిశుధ్య పనులను తనిఖీ చేస్తున్న సర్పంచ్ విశ్వనాథనాయుడు

పారిశుధ్య పనులపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి -కలకడ

పారిశుధ్యం పనులపై శ్రద్ధ వహించాలని సర్పంచ్ కె.విశ్వనాథ నాయుడు, ఎంపిడిఒ అబ్దుల్ రహీం పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పారిశుధ్య కార్యక్రమాలును తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ తరపున జనాలకు తాగునీటి సౌకర్యం, మజ్జిగ ఏర్పాటు చేయవలసిందిగా గ్రామ పంచాయతీ వారికి ఆదేశించారు. కార్యక్రమంలో గౌరవ మండల ఎఒ రమణ ప్రకాష్, సీనియర్ అసిస్టెంట్ ప్రతాప్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కె.దేవేంద్ర పాల్గొన్నారు.

టెన్నిస్ బాల్ క్రికెట్‌లో 'విభా' విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-నందలూరు

12వ సీనియర్ స్టేట్ లెవెల్ మెన్ అండ్ ఉమెన్ ఛాంపియన్షిప్ టెన్నిస్ బాల్ క్రికెట్‌లో స్థానిక విభ ఎరుడైట్ స్కూల్ విద్యార్థిని వేపగుంట హనీ ప్రియాంక కడప జిల్లా బాలికల టీంలో ఆడి అత్యుత్తమ ప్రదర్శనతో జట్టు విజయానికి కృషి చేసింది. తిరుపతి జిల్లా చంద్రగిరిలో జరిగినటువంటి ఆంధ్ర ప్రదేశ్ టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో 12వ సీనియర్ స్టేట్ లెవెల్ చాంపియన్షిప్‌ను కడప జిల్లా బాలికల జట్టు మొదటి స్థానమును కైవసం చేసుకున్నది. ఈ ఛాంపియన్షిప్‌కు రాష్ట్రంలోని అన్ని జిల్లాల టీములు బాలురు, బాలికలు టీంలు పాల్గొనగా బాలికల టీము ప్రతిభ కనబరచగా ఫైనల్ మ్యాచ్ నెల్లూరు వర్సెస్ కడప తలపడగా కడప బాలికల టీం ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. ఈ పోటీలలో నంద లూరు మండలంలోని విభా ఎరుడైట్ స్కూల్ విద్యార్థిని వేపగుంట హనీ ప్రియాంక ప్రశంస పత్రం మెడల్‌లు రాష్ట్ర స్థాయి అధికారులు చేత అందు కున్నారు. విభ ఎరుడైట్ స్కూల్ చైర్మన్ డాక్టర్ జయ భాస్కర్ రావు మెమోంటో అందజేసి అభినందించారు. స్కూల్లో జరిగిన అభినందన సభలో డాక్టర్ జయ భాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు, క్రీడల్లో కూడా రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రతి విద్యార్థి ఏ క్రీడల్లో అయితే ఆసక్తి ఉంటుందో ఆ క్రీడల్లో శిక్షణ పొందితే తప్పక విజయం సాధిస్తారని సూచిం చారు. అభినందన కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ చొప్పా సుజాత రెడ్డి, ఫైనాన్స్ ఇంచార్జ్ బి.సుజాతమ్మ, కో-ఆర్డినేటర్ తుమ్మల అమర్నాథ్ ఉపా ధ్యాయ బృందం, తదితరులు హనీ ప్రియాంకకు ప్రశంసించారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో డైరెక్టర్ రామలింగారెడ్డి

ప్రాంగణ ఎంపికల్లో 27 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-మదనపల్లె

స్థానిక ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం టివిఎస్ సుందరం ఫాస్ట్‌నర్స్ లిమిటెడ్ కంపెనీ ప్రాంగణ ఎంపికలు నిర్వహించగా 27 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి తెలిపారు. సందర్భంగా శాలలోని వివిధ విభాగాల నుండి 27 మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ.3 లక్షలు ఇస్తారని కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ సయ్యద్ హుస్సేన్ వీరిని ధృవీకరిం చారన్నారు. కళాశాల డైరెక్టర్. డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి ఎంపికైన విద్యా ర్థులను అభినందిస్తూ భవిష్యత్తులో మరి ఎన్నో ఉన్నత శిఖరాలకు ఎదగాలని వివరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు విద్యార్థులను అభినం దించారు. కార్యక్రమంలో ప్లేస్మెంట్ ఆఫీసర్ మనోజ్ కుమార్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

హంస వాహనంపై ఊరేగిన పార్వతి పరమేశ్వరులు

ప్రజాశక్తి- కలకడ

పార్వతి పరమేశ్వరులు హంస వాహనంపై పురవీధులలో ఊరేగించారు. మండలంలోని దేవళం పేటలో వెలిసిన శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు భాగంగా ఆదివారం రాత్రి హంస వాహనంపై పార్వతీ పరమేశ్వరుల సమేతంగా ఊరేగించామని ఆలయ ధర్మకర్త రవీంద్ర శర్మ పేర్కొన్నారు. మండలంలోని వడ్డెర కులస్తులు హంస వాహనాన్ని రంగురంగుల పూలతో విద్యుత్ దీపాలతో అలంకరించి దేవళంపేట, ఎర్రయ్య గారి పల్లి, కలకడ పురవీధులలో మేళతాళాలతో బళ్లారి డప్పులు, డిజె డాన్సులు నడుమ ఘనంగా అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ రామాంజనేయులు బందోబస్తు నిర్వహించారు.

నిరుపేద వధువుకు మంగళసూత్రం వితరణ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పెద్దతిప్పసముద్రం మండలంలోని రామాపురం మునిస్వామి కుమారుడు మునీంద్ర లావణ్యల వివాహం సోమవారం నిర్వహించారు. యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ తరుపున మంగళసూత్రం బహుమతిగా అందజేసినట్లు పౌండేషన్ వ్యవస్థాపకులు తగాది రాజశేఖర్ తెలిపారు. తమ సంస్థ ద్వారా వినూత్న సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం ఆనందం ఉందన్నారు. తమను ఆశ్రయించే వారికి మున్ముందు మరిన్ని సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని పేర్కొన్నారు. కార్యక్రమం ఫౌండేషన్ సభ్యులు రమణ, చిన్ని, రెడ్డి బాషా పాల్గొన్నారు.

కలికిరిలో యమహా షోరూం ప్రారంభం

ప్రజాశక్తి కలికిరి

కలికిరిలో యమహా షోరూంను సోమవారం యజమాని అఫూ మొహిద్దీన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలికిరి పట్టణంలోని కలకడ రోడ్డులోని ఖలీఫ్ గార్డెన్ ఆవరణంలో యమహా వాహన షోరూమ్‌ను ప్రారంభించామని, ఈ షోరూమ్‌లో ద్విచక్ర వాహనాలు, ఆటో వాహనాలు ప్రజలకు సరసమైన ధరలకు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కలికిరి చుట్టుపక్కల గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రారంభించిన మొదటి రోజు రెండు వాహనాలను కొనుగోలు చేసిన ఇద్దరు వ్యక్తులకు వాహనాలను అందజేశారు. కార్యక్రమంలో పల్లవోలు సర్పంచ్ ఇస్తియాక్ అహ్మద్, జకి ఉద్దీన్ షోరూం సిబ్బంది, కస్టమర్లు పాల్గొన్నారు.

కస్టమర్లకు యమహా వాహనాలు అందజేస్తున్న మొహిద్దీన్

ప్రజా సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికా రులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కా రంపై నేరుగా పర్యవేక్షణ చేస్తుందని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని తెలిపారు. అధికారు లందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలని పేర్కొన్నారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఎ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని తెలిపారు. వారి సమస్యను సావధానంగా వినాలని పేర్కొన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని పేర్కొన్నారు. చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదనరావు, ఎస్‌డి సి.రమాదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

సమష్టి సహకారంతో వైవీయూ అభివృద్ధికి కృషి

- నూతన విసి ఆచార్య పి.ప్రకాష్ బాబు

ప్రజాశక్తి - కడప అర్బన్

విశ్వవిద్యాలయ సమగ్ర ప్రగతిని దృష్టిలో ఉంచుకొని అందరి సహకారంతో అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు శాయశక్తుల కృషి చేస్తానని యోగివేమన విశ్వవిద్యాలయం నూతన విసి ఆచార్య ఫణతి ప్రకాష్‌బాబు పేర్కొన్నారు. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ బయోటెక్నాలజీ అండ్ బయోఇన్ఫర్మేటిక్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్‌గా ఉన్న ఫణితి ప్రకాష్ బాబును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వైవీయూ విసిగా నియమించిన విషయం తెలిసిందే. ఆయన సోమవారం విసి ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. రిజిస్ట్రార్ ఆచార్య పి. పద్మ, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి, వై ఎస్ఆర్ ఇంజినీరింగ్ కాలేజి ప్రిన్సిపల్ రమణయ్య, డీన్లు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు స్కాలర్లు పుష్పగుచ్ఛాలతో ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూతన విసి మాట్లాడుతూ విశ్వ విశ్వవిద్యాలయాన్ని అధ్యయనం చేసి ప్రభుత్వ సహకారంతో నిధులను తెస్తామన్నారు. బోధన పరిశోధన అత్యంత ప్రాధాన్యత అంశంగా

బాధ్యతలు స్వీకరిస్తున్న విసి ప్రకాష్‌బాబు

తీసుకుంటామని స్పష్టం చేస్తూ పరిశోధనలు ఆగిపోతే ప్రగతి ఉండదన్నారు. ఈ విశ్వవిద్యాలయంలో భాగమైనందుకు తాను చాలా సంతోషంగా ఉన్నానని చెప్పారు. విద్యార్థి కలలను , ఆకాంక్షలను నెరవేర్చడం వారిలో ఆత్మవిశ్వాసాన్ని మెరుగుపరచడం చేస్తామన్నారు. పాలకమండలి సభ్యులతో భేటీ అయ్యారు. విశ్వవిద్యాలయ అభివృద్ధిలో వారి సహకారాన్ని కోరారు. అనంతరం డీన్లు, వివిధ విభాగాల డైరెక్టర్లతో సమావేశమయ్యారు. పరిపాలనలో మీ పాత్ర కీలకమని విశ్వవిద్యాలయ కీర్తిని పెంచే నిర్ణయాలు స్వేచ్ఛగాతీసుకోవాలన్నారు. విద్యార్థుల అభివృద్ధి కోసం ఎలాంటి మార్పులు, నిర్ణయాలు తీసుకునేందుకు తాను సిద్ధమన్నారు. విసి గా బాధ్యతలు స్వీకరించిన ప్రకాష్‌బాబుకు పూర్వపు ఇన్‌ఛార్జి విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి, ప్రజా సంబంధాల విభాగం సంచాలకులు డాక్టర్ పి.సరిత, వివిధ విభాగాల డీన్లు ఆచార్య ఏజి.దాము, ఆచార్య రమాదేవి, ఆచార్య వై.సుబ్బరాయుడు, ఆచార్య చంద్ర ఓబుల్ రెడ్డి, ఆచార్య రఘు బాబు, డైరెక్టర్లు లక్ష్మీ ప్రసాద్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య కె.ఎస్.వి.కృష్ణారావు, సిపి బ్రౌన్ గ్రంథాలయ విశ్వవిద్యాలయ సంచాలకులు ఆచార్య పార్వతి, పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, ఆచార్య చంద్రమతి శంకర్, డాక్టర్ మాదక్క, కొండపల్లి సుబ్బారావు, ముబీనా బేగం,డాక్టర్ ప్రమోద, అధ్యాపకులు విద్యార్థులు స్కాలర్లు అభినందనలు తెలియజేశారు.

సామాజిక తనిఖీలో రూ.8,369 రికవరీ : పీడీ

మాట్లాడుతున్న పీడీ వెంకటరత్నం

ప్రజాశక్తి-కలకడ

సామాజిక తనిఖీ ప్రజావేదికలో రూ.8,369 రికవరీ చేసినట్లు జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు వెంకటరత్నం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల ఉపాధి హామీ పథకంలో 2023-2024 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో పీడీ వెంకటరత్నం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో రూ.8369 రికవరీకి ఆదేశించారు. రూ.42,128 బలయ్యగారిపల్లె గ్రామ పంచాయతీలో జరిగిన ఇంకుడు గుంతల నిర్మాణంపై డిఇపిఆర్ వారిని విచారణకు ఆదేశించారు. మండలంలోని పండ్ల తోటల పెంపకం సంబంధించి కొంత మొత్తంలో చనిపోయిన మొక్కలను తిరిగి నాటించమని ఆదేశించారు. పీడీ మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం 10 ఫాంపాండ్లు మార్చి నెలాఖరులోపు తవ్వవలసినదిగా ఆదేశించారు. కరువు మండలాలలో 50 పని దినాలు అదనంగా ఇచ్చిన కారణంగా, కూలీల సంఖ్య పెంచి ఎక్కువ మందికి పనులు కల్పించాల్సిందిగా అదేశించడమైనది. ఈ కార్యక్రమంలో ఎపిడి లక్ష్మి నరసింహా, ఎంపిడిఒ అబ్దుల్ రహీమ్, ఎస్ఆర్‌పి సుబ్బారావు, హౌసింగ్ ఎఇ నాగముని నాయక్, సామాజిక తనిఖీ డిఆర్‌పిలు, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు. ఉపాధి హామీ వేతన దారులు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-కలికిరి

ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి జి.మురళీకృష్ణ రైతులకు సూచించారు. కలికిరి కెవికెలో సోమవారం ప్రధానమంత్రి కిసాన్ నిధుల విడుదల కార్యక్రమాన్ని రైతులు ప్రత్యక్ష ప్రసారంలో వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి రైతుకు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ సమ్మేళన్ ప్రోగ్రాంలో 19 వ విడత పంట సాయాన్ని నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేశారని తెలిపారు. రైతులందరు ఈ నెల 28వ తేదీలోపు రైతు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలని సూచించారు. పీలేరు, వ్యవసాయ సహాయ సంచాలకులు వై.వి.రమణ రావు మాట్లాడుతూ వ్యవసాయంలోని ప్రభుత్వ పథకాలను రైతులకు వివరించారు. కెవికె శాస్త్రవేత్త డాక్టర్ వై.పీరు సాహెబ్ జీవశిలీంద్ర నాశీనులు, వివిధ పంటల్లో వాటి వాడకం గురించి వివరించారు. పాడి, ప్రకృతి వ్యవసాయంలోని అభ్యుధయ రైతులను సన్మానించారు. రైతులకు వ్యవసాయ పంచాగం, ట్రైకోడర్మా, సడోమోనాస్ రైతులకు అందచేశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ కె.మాధురి, డాక్టర్ కె.నవీన, డాక్టర్ ఎ.శ్రీనివాసులు, ఇతర కెవికె సిబ్బంది, రైతులు, మహానంది వ్యవసాయ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ పథకాలను రైతులకు వివరిస్తున్న వ్యవసాయాధికారి మురళీకృష్ణ

ఆర్‌డిఒకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

గ్రామ కంఠం కబ్జాపై ఆర్‌డిఒకు ఫిర్యాదు

ప్రజాశక్తి-పుల్లంపేట

రామక్కపల్లి గ్రామంలో రెవెన్యూ అధికారుల ఉత్తర్వులను బేకాతర్ చేశారని గ్రామస్తులు ఆర్‌డిఒకు ఫిర్యాదు చేశారు. వివరాలలోకి వెళితే..పుల్లంపేట మండలం రామక్కపల్లి గ్రామంలో సర్వే నంబర్ 547 నందు ఉన్న గ్రామకంఠంలో సత్యమ్మ తల్లి స్థలాన్ని కొందరు కబ్జా చేశారని దీనిపై 23-7-2023న రెవెన్యూ అధికారుల సమక్షంలో సత్తెమ్మ తల్లికి సంబంధించిన స్థలంను రెవెన్యూ అధికారులు గుర్తించి సర్వే చేసి హద్దులు నాటారని గ్రామస్తులు తెలిపారు. ఈ నెల 22వ తేదీన అదే గ్రామానికి చెందిన ఆకేపాటి రామచంద్రారెడ్డి అధికారులుకు కానీ, గ్రామస్తులకు కానీ తెలపకుండా గతంలో రెవెన్యూ అధికారులు నాటిన సర్వే హద్దులను బేఖాతర్ చేసి తొలగించారని ఇది చాలా హేయమైన చర్యని దీనిని వెంటనే రెవెన్యూ అధికారులు పరిశీలించి సత్తెమ్మ తల్లి స్థల వివాదాన్ని పరిష్కరించాలని గ్రామస్తులు అందరూ ఆర్‌డిఒకు వినతి పత్రం అందించారు.

కాలనీ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-పీలేరు

మండలంలోని జాండ్ల గ్రామ పంచాయతీ, గుట్టకిందపల్లి మాదిగపల్లిని తహశీల్దారు భీమేశ్వరరావు సోమవారం సందర్శించారు. గుట్టకిందపల్లి మాదిగ పల్లి వాసులు తమ ఇండ్ల వద్ద నాటుకున్న టెంకాయ, నిమ్మ చెట్లను సిద్ధారెడ్డి అనే వ్యక్తి దౌర్జన్యంగా జెసిబి సాయంతో శనివారం అర్ధరాత్రి తవ్వించేసిన సంగతి పాఠకులకు విధితమే. సమాచారం అందుకున్న పీలేరు తహశీల్దారు భీమేశ్వర రావు సోమవారం ఉదయం తన సిబ్బందితో గ్రామాన్ని సందర్శించి గ్రామానికి సంబంధించిన భూమి రికార్డులను, మ్యాప్‌ను పరిశీలించారు. గ్రామ సరిహద్దులను సర్వే చేసి నివేదిక ఇవ్వాలని విలేజ్ సర్వేయర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తాము తమ గ్రామంలో 100 ఏళ్లుగా కాపురం ఉంటున్నామని, తమ ఇండ్లకు అనుకొని ప్రభుత్వం మాకు కేటాయించిన కాలనీ స్థలంలో మాత్రమే తాము చెట్లు నాటుకుని 40 ఏళ్లుగా చెట్లు పెంచి పోషించుకుంటున్నామని, ఇప్పుడు దౌర్జన్యంగా కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ అనుభవంలోని చెట్లు, భూమి తమకే చెందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మొరపెట్టుకున్నారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుడ్డు రామకృష్ణ, పీలేరు నియోజకవర్గ ఇన్చార్జి గండికోట వెంకటేష్, గ్రామ రైతు దామోదర్ రెడ్డి, పీలేరు చరణ్ కుమార్, రెడ్డి కుమార్, నరసింహ, గంగాధర, కెవి పల్లి రాము, రాజేష్, వాల్మీకిపురం మండల నాయకులు గంత బాలకృష్ణ, సీనియర్ నాయకులు ఈపూరి వెంకటరమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేలమల్లేశ్వర ఆలయంలో శివరాత్రి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండలం, తవలం గ్రామంలో వెలసిన స్వయంభవుడు శ్రీ నేలమల్లేశ్వర స్వామి దేవస్థానం మహాశివరాత్రి సందర్భంగా సర్వాంగ సుందరంగా ముస్తాబవుతుంది. ఈ సందర్భంగా ఆలయ ఇఒ మంజుల మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం నేల మల్లేశ్వర స్వామి ఆలయం వద్ద శివరాత్రి సందర్భంగా అన్ని ఏర్పాట్లును సిద్ధం చేసినట్లు తెలిపారు. భక్తులకు సులభ దర్శనం కల్పించడానికి అవసరమైన క్యూలైన్లు ఏర్పాటు, మంచినీటి సదుపాయం, శానిటేషన్ పనులు, షామియానాలు ఏర్పాటు, విద్యుత్ దీపాలంకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మదనపల్లి రూరల్ సిఐ సత్యనారాయణ, నిమ్మనపల్లి ఎస్ఐ తిప్పేస్వామి దేవస్థానంను సందర్శించి భక్తులకు సౌకర్యంగా ఏర్పాట్లపై తగు సూచనలు ఇచ్చారు. వాహనాల రద్దీపై ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నామన్నారు. దాతల సహకారంతో, చిన్న రెడ్డప్పరెడ్డి, చంద్రారెడ్డి, ఎం.రామకృష్ణ, సర్పంచ్ కె.రెడ్డప్ప ఆధ్వర్యంలో ఆలయం వద్ద రెండు రోజులు అన్నదాన కార్యక్రమం చేపడుతున్నామన్నారు. నేలమల్లేశ్వర స్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి ఏర్పాట్లను ఇఒ మంజుల పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు.

కేక్ కట్ చేస్తున్న విద్యార్థులు

జెఎన్‌టియు సెమినార్‌లో 'బిట్స్' విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-రామాపురం

జెఎన్‌టియు ప్రకటించిన ఫస్ట్ సెమినార్‌లో తమ కళాశాల విద్యార్థులు సత్తా చాటారని బిట్స్ కళాశాల చైర్మన్ మన్నూర్ భాస్కర్ పేర్కొన్నారు. ప్రతిభ చాటుకున్న విద్యార్థులతో చైర్మన్ ఆధ్యాత్మిక బృందం కలిసి సోమవారం సక్సెస్ మీట్ ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలో తమ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చాటడం చాలా సంతోషంగా ఉందన్నారు. (సిఎస్ఇ) పటాన్ షాజిదా ఖానం సిఎస్ఇలో 87 శాతంతో యూనివర్సిటీ టాపర్‌లో ఒకరుగా నిలిచారన్నారు. సాయి దర్శిని (ఎఐ) 80 శాతం, మరో20 మంది విద్యార్థులు 80% కన్నా ఎక్కువగా సాధించారని చెప్పారు. 30 విద్యార్థులు 70శాతం కన్నా ఎక్కువగా ఫస్ట్ క్లాస్ డిస్టెన్స్‌లో విజయవంతంగా నిలిచారన్నారు. కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. మారుమూల ప్రాంతంలో కళాశాల ఏర్పాటు చేసి అనతి కాలంలోనే ఇంతటి విజయం సాధించడం చైర్మన్ సంతోషం వ్యక్తం చేశారు. కళాశాలకు ఇలాంటి విజయాలు మరెన్నో అందించాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు ఇంత విజయాన్ని కారణమైన అధ్యాపక బృందానికి, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులు 'బందెల'కు సన్మానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన బందెల గౌతమ్ కుమార్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టి సోమవారం మదనపల్లెకి వచ్చిన సందర్భంగా పార్టీ శ్రేణులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పట్టణంలో బిఎస్‌పి నాయకులు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. తన రాకను పురస్కరించుకొని పార్టీ శ్రేణులు అఖండ స్వాగతం ఏర్పాటు చేయడం పట్ల పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీని క్షేత్రస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బలోపేతం చేసి అధికార పార్టీ వైఫల్యాలు ఎండగట్టడంతోపాటు ప్రజల గొంతుకై ప్రభుత్వాన్ని నిలదీసి పేదలకు న్యాయం జరిగేలా చూస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బిఎస్‌పి శ్రేణులు, ప్రజా సంఘాలు, బహుజన నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ఇసుక తరలిస్తే ఊరుకునేది లేదు

- తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రజల ఆందోళన

ప్రజాశక్తి - వీరబల్లి

మాండవ్య నదిలో ఇసుకను తరలిస్తే ఊరుకునేది లేదని వీరబల్లి వాసులు, ఆయా గ్రామాలకు చెందిన రైతులు పేర్కొన్నారు. మాండవ్య నదిలో ఎందుకు ఇసుక తరలిస్తారని, దీని వల్ల తాగునీటి సమస్య నెలకొందని, ఎవరు పరిష్కరిస్తారని తహశీల్దార్ వెంకటేష్ ప్రశ్నించారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట వీరబల్లి వాసులు, ఆయా గ్రామాల రైతులు, ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వారానికి ఒక్కసారి కూడా తాగునీరు వచ్చే పరిస్థితి లేదన్నారు. రోజూ వందల ట్రిప్పులు ఇసుక రాయచోటికి తరలిస్తున్నారని, ఇలా తరలిస్తే తాము ఇసుక ట్రాక్టర్లు అడ్డుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే ఆలస్యం చేశామని, ఇక మీదట మాండవ్య నది లోకి వెళ్ళనిచ్చే పరిస్థితి లేదని తెగేసి చెప్పారు. నది సమీపంలోని తోటల్లో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు ఎండి పోయాయని ఆయా గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పలువురు ట్రాక్టర్ యజమానులు అడ్డుకుంటే తమను తొక్కిస్తామని బెదిరిస్తున్నారని, ఇకమీదట తరలిస్తే వారికి అర్థం అవుతుందని పేర్కొన్నారు. అనంతరం సంతకాలతో కూడిన ఫిర్యాదును తహశీల్దార్‌కు అందజేశారు. స్పందించిన తహశీల్దార్ ఇసుక తరలింపు ప్రభుత్వ నిబంధన అని, ఈ విషయంపై జిల్లా అధికారులకు, కలెక్టర్‌కు నివేదిస్తామని చెప్పారు.

కొత్తపేట జడ్‌పి పాఠశాలకు సౌండ్ సిస్టమ్ అందజేత

ప్రజాశక్తి-పుల్లంపేట

మండలంలోని కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 2008వ సంవత్సరం పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆహుజా కంపెనీ యొక్క సౌండ్ సిస్టమ్‌ను బహూకరించారు ఈ సందర్భంగా పాఠశాల ప్రధానో పాధ్యాయులు బి.మల్లికార్జున, పాఠశాల కమిటీ చైర్మన్ అవ్వారు చెంగయ్యకు వితరణ అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు సౌండ్ సిస్టమ్ ఇచ్చినందుకు గాను వారికి అభినందనలు తెలిపారు. ఈ యొక్క సౌండ్ సిస్టం వల్ల పాఠశాలలో జరిగే కార్యక్రమాలకు మరియు ప్రార్థన గీతానికి చక్కగా ఉపయోగించుకుని సద్వినియోగం చేసుకుం టామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపి నుంచి టిడిపిలో 200 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని కోనాపురం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు ఆనంద, తిరుపాల్ వారి అనుచరులు ఆ పార్టీని వీడి మాజీ ఎంపిపి భువనబోయిన లక్ష్మీ నరసయ్య ఆధ్వరంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయ శేఖర్‌రెడ్డి సమక్షంలో దాదాపు 200 కుటుంబాలకు చెందిన వారు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మేడా విజయ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో కోనాపురం గ్రామంలో 300 పైబడి ఓట్లు టిడిపికి మైనస్ అయ్యాయని తెలిపారు. దీనిని అధిగమించడానికి వచ్చే సార్వతిక ఎన్నికలలో నారా లోకేష్‌ను ముఖ్యమంత్రి చేయాలంటే అందరినీ కలుపుకొని తెలుగుదేశం పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తున్నామని తెలిపారు. నందలూరు మండలాన్ని తెలుగుదేశం పార్టీ కంచుకోటగా నిర్మిస్తామని పేర్కొన్నారు. పార్టీ అభివృద్ధికి అందరం కలికట్లుగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి భువన బోయిన లక్ష్మీనరసయ్య, టంగుటూరు ఎంపిటిసి పెంచలయ్య,టంగుటూరు సర్పంచ్ మైనుద్దీన్, టిడిపి నాయకులు చుక్కాయానాది, కోనాపురం ఉప సర్పంచ్ పుల్లయ్య, ఇబ్రాయిల్ నార్ల పెంచలయ్య గుజ్జుల ఈశ్వరయ్య, శ్రీనివాసుల రెడ్డి,చిన్న ఎల్లయ్య,పెద్ద ఎల్లయ్య, కోనాపురం గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నుంచి టిడిపిలో చేరిన కోనాపురం గ్రామస్తులు